క్లుప్తంగా

ఎల్‌వోసీ అందజేత

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం గోవిందపేట్ గ్రామానికి చెందిన అరుణ్ కుమార్‌కు మాజీ సర్పంచ్ మూగ ప్రభాకర్ గురువారం ఎల్‌వోసీ అందజేశారు. నిరుపేద కుటుంబానికి చెందిన అరుణ్ గుండెకు సంభందించిన వ్యాధితో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌చార్జీ పొద్దుటూరి వినయ్ రెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.2 లక్షల 50 వేల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. సంబంధిత పత్రాన్ని మాజీ సర్పంచ్ మూగ ప్రభాకర్ బాధితుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

క్రీడా పరికరాల వితరణ



వేల్పూర్: వేల్పూర్ మండలం మోతె హైస్కూలులో విద్యార్థులకు క్రీడా పరికరాలను గ్రామానికి చెందిన జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ దొల్ల రాజేశ్వర్‌రెడ్డి గురువారం వితరణ చేశారు. విద్యార్థులు క్రీడల్లో రాణించడానికి అవసరమున్న క్రీడా పరికరాలను అందజేసిన రాజేశ్వర్‌రెడ్డికి హెచ్‌ఎం వైద్య గణేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఉపాధ్యాయులు రత్నయ్య, నరసింహారావు, శ్రావణశ్రీ, కవిత, ఫిజికల్ డైరెక్టర్ సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

తాగునీటి ట్యాంకు..

బోధన్ రూరల్: మండలంలోని అమ్దాపూర్ జెడ్పీ హైస్కూల్‌కు ఐ లవ్ ఇండియా ఫౌండర్ పి.నాగేందర్ రూ 20 వేల విలువ గల 15 వేల లీటర్ల సామర్థ్యం గల తాగు నీటి ట్యాంక్‌ను వితరణ చేశారు. ఐ లవ్ మై విలేజ్ కో- ఆర్డినేటర్స్ ఎస్.ప్రభావతి, కాంత, మంజుల, బోధన్ మండల విద్యాధికారి నాగనాథ్ ఆధ్వర్యంలో తాగు నీటి ట్యాంక్‌ను ప్రాంభించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సూర్యకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థుల తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన ఐ లవ్ మై విలేజ్ సంస్థకు ధన్యవాదాలు తెలిపారు.

పంచాయత్‌రాజ్ డీఈగా కిషన్ నాయక్



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ డివిజన్ పంచాయత్‌రాజ్ డీఈగా కిషన్ నాయక్ గురువారం బాధ్యతుల స్వీకరించారు. డీఈగా ఇటీవల వరకు విధులు నిర్వహించిన బాబురాం పదవీ విరమణ పొందారు. ఆయన స్థానంలో ఇందల్వాయి పీఆర్ ఏఈగా పనిచేస్తున్న కిషన్ నాయక్ పదోన్నతిపై ఆర్మూర్‌లో డీఈగా బాధ్యతలు చేపట్టారు. ఈఈలు భావన్న, రాజేశ్వర్, పీఆర్ ఏఈలు నితీష్, రాజ్ కుమార్, మేఘన, ఇంద్రసేన్ రెడ్డి, పాల్గొన్నారు.

జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా రజీయొద్దీన్

బాల్కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన ప్రిన్సిపాల్‌గా గురువారం రజీయొద్దీన్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన గతంలో ధర్పల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తించి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వర్తించిన చిన్నయ్య అయిలాపూర్ జూనియర్ కళాశాలకు బదిలీపై వెళ్లారు.

పోస్టర్ల ఆవిష్కరణ

వర్ని: బాల సాహిత్య రజతోత్సవంలో భాగంగా పత్తిపాక ఫౌండేషన్ గరిపెల్లి ట్రస్ట్ ద్వారా నిర్వహించే పిల్లల సృజనాత్మకపై అవ్వాతాతలకు ఉత్తరాలు రాద్దాం రండి అనే పోస్టర్‌ను గురువారం వడ్డేపల్లి హైస్కూల్లో ఆవిష్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రకరణ్ రెడ్డి, ఉపాధ్యాయులు కనకరాజు, శ్యాంకుమార్, రేణుక, మేరీ, ప్రతిమ పాల్గొన్నారు.

ఓబీసీ 9వ మహాసభ పోస్టర్లు..

బాల్కొండ: భారత జాతీయ ఓబీసీ 9వ మహాజన సభకు సంబంధించిన వాల్ పోస్టర్లను గురువారం మెండోరా మండలం సావెల్ గ్రామంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓబీసీ నాయకులు మాట్లాడారు. పంజాబ్‌లోని అమృత్‌సర్‌లో ఈ నెల 7న నిర్వహించే సభను విజయవంతం చేయాలని కోరారు. బాల్కొండ నియోజకవర్గ ఓబీసీ ఇన్‌చార్జి నేల్లా లింగన్న, నాయకులు కట్ట సత్యనారాయణ, వినయ్ సాగర్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

కౌమార దశపై విద్యార్థులకు అవగాహన

బోధన్/పెర్కిట్(ఆర్మూర్): ఉమెన్స్ ఆర్గనైజేషన్ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (వర్డ్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఆర్మూర్ మండలం గోవింద్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సాలూర మండలంలోని సాలూర, హున్స జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల్లో 8,9,10 తరగతుల విద్యార్థినీ, విద్యార్థులకు వేర్వేరుగా సమావేశాలు నిర్వహించి కౌమార దశలో వచ్చే శారీరక, మానసిక, సామాజిక మార్పులపై అవగాహన కల్పించారు.. ఆ సంస్థ కమ్యూనిటీ కో-ఆర్డినేటర్స్ కూర చంద్రశేఖర్, రజితలు విద్యార్థులకు వివరించారు. వ్యక్తిగత పరిశుభ్రత, గృహ హింస చట్టం, హెచ్‌ఐవీ, ఎయిడ్స్ వ్యాధుల తదితర అంశాల గురించి వివరించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, సంస్థ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో జూనియర్ కళాశాల

- రేకుల పెడ్డులోనే విద్యా బోధన
- వర్షాకాలంలో ఇబ్బందులు తీవ్రం



తరగతి గదిలో పగిలిన రేకులు



వర్షంతో తేమ వచ్చిన అధ్యాపకుల గది

ఆర్మూర్‌టౌన్: ప్రభుత్వాలు విద్యావ్యవస్థలను పటిష్టం చేస్తాయంటున్నప్పటికి మాటలకే పరిమితమవుతున్నాయి. ప్రభుత్వాలు మారుతున్నా కళాశాల పరిస్థితి మారడం లేదు. ఆర్మూర్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కోఎడ్యుకేషన్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, సీటీ తెలుగు, ఇంగ్లీష్ మీడియం ఉంది. 196లో ఈ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతంలో 320మంది వరకు విద్యార్థులు చదువుతున్నారు. కాని కళాశాల భవనం వర్షానికి నీరు కారుతోంది. దీంతో అటు అధ్యాపకులు, ఇటు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కళాశాల సమస్యలకు నిలయంగా మారింది. కొన్ని తరగతి గదుల్లో రేకులు పగిలిపోవడంతో వర్షం కురిస్తే నేరుగా క్లాస్‌లో పడుతోంది. మూత్రశాలల కూడా సరిగా లేవు. కళాశాలలో బోరు ఉన్నప్పటికి నీరు రావడం లేదని విద్యార్థులు చెబుతున్నారు. అలాగే రెండేళ్ల నుంచి కో-ఎడ్యుకేషన్‌లో బాలికలు చేరి విద్యను అభ్యసించారు. ఈ ఏడాది కళాశాలలో ఒక్క బాలిక కూడా చేరలేదు. కళాశాల సమయంలో బస్సులు లేకపోవడంతో కూడా విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది. బస్టాండ్ నుంచి కళాశాల దూరంగా ఉండటంతో విద్యార్థులు కళాశాలలో చేరడానికి ఇష్టపడటం లేదు. కళాశాలలో అధ్యాపకులు పూర్తిస్థాయిలో ఉన్నారు. అన్ని సౌకర్యాలతో కళాశాలకు నూతన భవనం నిర్మిస్తే విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

నూతన భవనం నిర్మించాలి



కళాశాల భవనం చాలా పాతది. నూతన భవనం నిర్మిస్తే బాగుటుంది. క్లాస్‌రూమ్‌ల రేకులు పగిలిపోయి ఉన్నాయి. తరగతి గదులకు మరమ్మతులు చేయించాలి.

–నితిన్, విద్యార్థి, ఆర్మూర్ జూనియర్ కళాశాల

బస్సు సౌకర్యం కల్పించాలి



కళాశాలకు వెళ్లే దారిలో బస్సులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సులు లేపోవడంతో విద్యార్థులు నడుచుకుంటూ రావాల్సిన పరిస్థితి ఏర్పడింది.

– శివకుమార్, విద్యార్థి, జూనియర్ కళాశాల ఆర్మూర్

తల్లిపాలతో వ్యాధి నిరోధక శక్తి



రాకాసీపేట్‌కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్



రుద్రూరు అంగన్‌వాడీ కేంద్రంలో ..

బోధన్‌టౌన్(బోధన్): తల్లి పాలు బిడ్డకు ఇవ్వడం వల్ల పిల్లల్లో వ్యాధినిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక అన్నారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని రాకాసీపేట్‌లో రాజమల్లు క్యాంప్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు విక్టోరియా రాణి, రత్న, లక్ష్మి, సరోజ అర్చన, తదితరులు పాల్గొన్నారు.

వర్ని: రుద్రూర్‌లోని అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలను గురువారం మధ్యాహ్నాం ఒంటి గంటకు నిర్వహించారు. తల్లిపాల విశిష్టత గురించి విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు.

తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవి

నందిపేట్ (ఆర్మూర్): చిన్నారులకు తల్లిపాలు ఎంతో శ్రేష్టమైనవని అంగన్వాడీ సూపర్వైజర్ రేఖ అన్నారు. నందిపేట మండల కేంద్రంలో గురువారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ అంశాలపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు.

మాక్లూర్: తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గురువారం దుర్గానగర్‌తండా అంగన్‌వాడీ కేంద్రంలో తల్లి పాల వారోత్సవాలను ప్రారంభించారు. గర్భిణీలు తీసుకోవాల్సి ఆహారం, ముర్రుపాల ఉపయోగం వంటి అంశాలపై అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత అవగాహన కల్పించారు. ఎంపీవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాలూర గ్రామానికి ప్రత్యేకంగా బస్సు నడిపించాలి

బోధన్: పట్టణ కేంద్రానికి చదువు కోసం పాఠశాలలు, కళాశాలలకు వస్తున్న తమకు ప్రత్యేక బస్సును నడిపించాలని సాలూర గ్రామ విద్యార్థులు ఆందోళన చేపట్టారు. గురువారం భారతీయ విద్యార్థి సేన(బీవీఎస్) ఆధ్వర్యంలో విద్యార్థులు బోధన్ ఆర్టీసీ డిపో ఎదుట ధర్నా చేశారు. తాము ఎదుర్కొంటున్న అవస్థలను డిపో అధికారులకు విన్నవించారు. సుంకిని నుంచి వయా హున్స, ఖాజాపూర్, సాలూర మీదుగా బోధన్ వరకు ఉదయం 7.15 గంటలకు నడిపిస్తున్న బస్సులో విద్యార్థుల సంఖ్య అధికంగా ఉండటం వల్ల బస్సు పైన ఎక్కి వెళ్లాల్సిన వస్తుందని వాపోయారు. ఇప్పటికై నా సాలూర గ్రామానికి ప్రత్యేక బస్సును నడిపించి తమ ఇబ్బందులను పరిష్కరించాలని కోరారు. బీవీఎస్ పట్టణ అధ్యక్షుడు కస్ప లింగం మాట్లాడుతూ.. విద్యార్థులకు ఏదైనా జరిగితే డీఎం బాధ్యత వహిస్తారా అని ప్రశ్నించారు.



బోధన్ డిపో ఎదుట ధర్నా చేస్తున్న సాలూర గ్రామ విద్యార్థులు, బీవీఎస్ నాయకులు

వృత్తి నైపుణ్యాభివృద్ధిని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న నాగయ్య



శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులు

బోధన్: విద్యార్థుల అభ్యాసన సామర్థ్యాల పెంపుదల కోసం వృత్తి నైపుణ్యాభివృద్ధి పెంపొందించుకోవాలని విద్యాశాఖ మండల నోడల్ ఆఫీసర్ నాగయ్య సూచించారు. ఎస్‌సీఈఆర్‌టీ జాతీయ స్థాయిలో నవంబర్‌లో మూడో తరగతి విద్యార్థులకు నిర్వహించే నేషనల్ అచీవ్‌మెంట్స్ సర్వే(న్యాక్) పరీక్షలకు సన్నద్ధత లక్ష్యంగా గురువారం పట్టణ కేంద్రంలోని రాకాసీపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బోధన్, సాలూర మండలాల్లోని ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తెలుగు, గణితం, ఆంగ్లం, పరిసరాల విజ్ఞానం సబ్జెక్టుల్లో శిక్షణ ఇచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. కాంప్లెక్స్ స్కూల్ హెచ్‌ఎంలు బాలచంద్రన్, జ్యోతి, ఆరిఫొద్దీన్, సూర్యకుమార్, ఆర్పీలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

'బధిరుల పాఠశాలను కళాశాలగా అభివృద్ధి చేస్తాం'

ఆర్మూర్: పట్టణంలోని సీఎస్ఐ బధిరుల పాఠశాలను కళాశాలగా అభివృద్ధి చేయడానికి చర్యలు తీసుకుంటామని సీఎస్ఐ డిప్యూటీ మోడరేటర్ రూబెన్ మార్క్ పేర్కొన్నారు. పాఠశాలను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న సేవలను స్వయంగా పరిశీలించారు. ఆయన వెంట డయాసెస్ అధికారులు ప్రభుకిరణ్, వైస్ చైర్మన్ విన్సంట్, ప్రాపర్టీ సెక్రటరీ మంత్రి సాల్మన్, స్థానిక చర్చి పాస్టర్ మన్నె శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులున్నారు.

ఇందిరమ్మకాలనీ సమస్యల్ని పరిష్కరించండి

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని ఇందిరమ్మకాలనీలో సమస్యలను వెంటనే పరిష్కరించాలని బీజేపీ ముప్కాల్ మండల అధ్యక్షుడు సంతోష్ రెడ్డి కోరారు. గురువారం మండల కేంద్రంలోని ఇందిరమ్మకాలనీలోని సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీలో జీపీకి 10 శాతం వదిలిన భూములను స్థానిక ప్రజాప్రతినిధులు అక్రమించుకున్నారని ఆరోపించారు. కాలనీలో వర్షం కురిస్తే ఇళ్లలోకి నీరు వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు దినేష్, గోపాల్, గంగాధర్, గోపినాథ్, తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణకు సహకరించాలి



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో రాజాగౌడ్

పెర్కిట్(ఆర్మూర్): జాతీయ రహదారుల విస్తరణలో భాగంగా ప్రభుత్వం చేపడుతున్న భూసేకరణకు రైతులు సహకరించాలని ఆర్డీవో రాజాగౌడ్ సూచించారు. ఆర్మూర్ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం 63వ నెంబరు జాతీయ రహదారి విస్తరణలో భూములు కోల్పోతున్న పెర్కిట్, కొటార్మూర్, చేపూర్ గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ.. భూసేకరణలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వం నుంచి మెరుగైన నష్టపరిహారం అందేలా చూస్తామన్నారు. అనంతరం నష్టపరిహారం వివరాలను రైతులకు తెలియజేశారు. తహసీల్దార్ గజానన్ పాల్గొన్నారు.

వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు హర్షణీయం



బోధన్‌లో సంబురాలు చేసుకుంటున్న ఎమ్మార్పీఎస్ నేతలు



మాక్లూర్‌లో..

ఎస్సీ వర్గీకరణపై దేశ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు పట్ల ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. జిల్లా వ్యాప్తంగా టపాసులు కాల్చి స్వీట్లు పంచారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేసి సంబురాలు జరుపుకున్నారు. ఎన్నో ఏళ్లుగా జరిగిన పోరాటానికి న్యాయం జరిగిందని, ఎస్సీ వర్గీకరణ చేసే అధికారం రాష్ట్రాలకు ఉందని సుప్రీంకోర్టు తీర్పునివ్వడం ఆనందంగా ఉందని నేతలు అన్నారు.

– సాక్షి నెట్‌వర్క్

డీసీసీబీ బ్రాంచ్‌ను సందర్శించిన చైర్మన్



రమేష్ రెడ్డికి స్వాగతం పలుకుతున్న అధికారులు

బోధన్: పట్టణ కేంద్రంలో వేర్వేరు చోట్ల ఉన్న డీసీసీబీ రెండు బ్రాంచ్‌లను గురువారం డీసీసీబీ డైరెక్టర్లు గిర్దావర్ గంగారెడ్డి, శరత్‌లతో కలిసి చైర్మన్ కుంట రమేష్ రెడ్డి సందర్శించారు. బ్యాంక్ బ్రాంచ్ పాత భవనాన్ని పరిశీలించారు. అనంతరం బ్యాంక్ మేనేజర్లతో మాట్లాడారు. బ్యాంక్ ఆర్థిక లావాదేవీలు, లాకర్స్, రైతుల రుణమాఫీ అంశాలకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీసీసీబీ చైర్మన్‌కు బ్యాంకు అధికారులు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. పెంటకలాన్ సొసైటీ చైర్మన్ రాజారెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు, నాయకుడు నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి

బోధన్‌టౌన్(బోధన్): పోలీసు, రవాణా శాఖ ఆధ్వర్యంలో గురువారం పట్టణంలోని శక్కర్‌నగర్ చౌరస్తాలో వాహనాల తనిఖీ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా వాహనాల ధ్రువపత్రాలను ఏసీపీ శ్రీనివాస్, ఎంవీఐ శ్రీనివాస్‌లు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని లేని పక్షంలో చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు. 15 నుంచి ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. సీఐ వీరయ్య, ట్రాఫిక్ సీఐ చందర్ ఉన్నారు.

ఇంటింటికి మొక్కల పంపిణీ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని రెండవ వార్డులో స్థానిక కౌన్సిలర్ ఖాందేష్ సంగీత ఇంటింటికి మొక్కలను అందజేశారు. వనమత్సోవంలో భాగంగా రంగాచారినగర్, సంతోష్‌నగర్, వడ్డెర కాలనీ ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. పట్టణ కాంగ్రెస్ నాయకులు ఖాందేష్ సత్యం, ప్రశాంత్, సంతోష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు

నేడు విద్యుత్ శాఖ- రైతు బాట కార్యక్రమం

భీమ్‌గల్: భీమ్‌గల్ టౌన్ సెక్షన్‌లోని చేంగల్ డిస్ట్రిబ్యూషన్‌లో శుక్రవారం ఉదయం 9 గంటలకు నిర్వహించే విద్యుత్ శాఖ- రైతు బాట కార్యక్రమానికి విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది అందరు తప్పనిసరిగా హాజరు కావాలని విద్యుత్ శాఖ ఏఈ రూప్ సాయి తెలిపారు. విద్యుత్ లైన్ల సవరణ, విద్యుత్ స్తంభాల సవరణ, అవసరమైన చోట చెట్ల కొమ్మలు నరికివేయడానికి అవసరమైన సామగ్రిని వెంట తెచ్చుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎక్కడైనా సమస్యలుంటే అధికారుల దృష్టికి తేవాలన్నారు.

జాతీయ అవయవదాన పక్షోత్సవాలు

బోధన్: జాతీయ అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం నుంచి ఈ నెల 15 వరకు అవయవదాన అవగాహన పక్షోత్సవాలను దేశ వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలంగాణ శరీర అవయవదాతల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కాట్రగడ్డ భారతి గురువారం తెలిపారు. ఇందులో భాగంగా శుక్రవారం పట్టణ కేంద్రంలో ర్యాలీ, అవగాహన సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 6 గంటలకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం నుంచి ర్యాలీ ప్రారంభమై విద్యా వికాస్ జూనియర్ కళాశాల వరకు కొనసాగుతుందన్నారు.

సినిమాలు తెలుగు/హిందీ/ఇంగ్లీష్



పీవీఆర్ మల్టీప్లెక్స్(ఆర్మూర్)

స్క్రీన్-1 –	రాయన్ (తెలుగు) - 11.40, కల్కి 2898 ఏడీ (తెలుగు) - 2.50, 6.35, 10.20
స్క్రీన్-2 –	డెడ్‌పూల్ 3డీ (తెలుగు)- 10.30, 1.30, 4.30, 7.30, 10.30
స్క్రీన్-3 –	రాయన్ (తెలుగు) - 01.00, 4.10, 7.20, 10.30
స్క్రీన్-4 –	శివం భజే (తెలుగు) - 11.00, 1.45 4.30, 7.35, 10.00

బేషరతుగా క్షమాపణలు చెప్పాలి



నందిపేటలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



వేల్పూర్‌లో..

సాక్షి నెట్‌వర్క్ : బీఆర్‌ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి వారికి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దిష్టిబొమ్మలను దహనం చేశారు. మహిళల పట్ల దురుసు వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్యానికి సిగ్గుచేటని ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ నాయకులు వ్యాఖ్యానించారు.

సంక్షిప్తం


వన మహోత్సవాన్ని వేగవంతం చేయాలి

బాల్కొండ: వన మహోత్సవాన్ని గ్రామాల్లో విజయవంతం చేయాలని బాల్కొండ ఎంపీవో గంగామోహన్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించి మాట్లాడారు. నాటిన ప్రతి మొక్కను సంరక్షించటానికి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామానికి కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు.

ప్రతిఒక్కరు మొక్కలు నాటాలి

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని బాలుర జూనియర్ కళాశాలలో గురువారం నూతన ప్రిన్సిపాల్‌గా విజయానంద్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. వర్షాకాలంలో ప్రతి ఒక్కరు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కళాశాల అభివృద్ధికి కృషిచేస్తామన్నారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ప్రిన్సిపాల్‌ను, అధ్యాపకులు సన్మానించి స్వాగతం పలికారు.

డీఎడ్ కళాశాల అధ్యాపకులకు సన్మానం



బోధన్: పట్టణ కేంద్రంలోని ఆచన్‌పల్లి ప్రాంతంలోగల సెయింట్ థామస్ డీఎడ్ కాలేజీల్లో తమ కోర్సును పూర్తి చేసుకుని వెళ్తున్న ఛాత్రోపాధ్యాయులు గురువారం కళాశాల ప్రాంగణంలో కళాశాల ప్రిన్సిపల్ అశోక్ రోడే, అధ్యాపకులు నాగజ్యోతి, అజీజ్, ఉస్మాన్‌లను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ఆస్మా, సాదీయ, నేహ తదితరులు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్తన ఉద్యోగులకు..

వేల్పూర్: వేల్పూర్ మండల పరిషత్తు కార్యాలయం నుంచి ఇటీవల బదిలీపై వెళ్తున్న ఉద్యోగులను ఎంపీడీవో బాలకిషన్ గురువారం సన్మానించారు. ఎంపీఈవో జావెద్ హైమద్, సూపరింటెండెంట్ భీమ్‌రావు, సీనియర్ అసిస్టెంట్ సుమిత్ర, టైపిస్టు శ్రావణ్, ఆఫీసు సబార్డినేట్‌లు శంకర్, సాయన్న వీరితో పాటు వాడి, అక్లూర్ ఒడ్డెర కాలనీ, కోమన్‌పల్లి, అంక్సాపూర్ జీపీ కార్యదర్శులు కూడా బదిలీ అయ్యారు. సన్మానించి, మెమెంటోలు అందజేశారు.

ఏకకాలంలో రుణమాఫీ చేయాలి



మాట్లాడుతున్న బీజేపీ నేత నూతుల శ్రీనివాస్‌రెడ్డి

ఆర్మూర్‌టౌన్: రైతులకు వ్యవసాయ రుణాన్ని బేషరతుగా ఏకకాలంలో మాఫీ చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు నూతుల శ్రీనివాస్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆర్మూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీజేపీ నాయకులు సమావేశం నిర్వహించి మాట్లాడారు. రైతుల కోసం రుణమాఫీ విషయంలో హెల్ప్ లైన్ నెంబర్ 8886100097 బీజేపీ ఏర్పాటు చేసిందన్నారు. రుణమాఫీ అమలేయ్యంత వరకు రైతుల పక్షాన బీజేపీ కిసాన్ మోర్చా పోరాడుతుందన్నారు.

తహసీల్దార్‌కు వినతి

మాక్లూర్: బ్యాంకుల్లో బాకీ ఉన్న ప్రతి రైతుకు రుణ మాఫీ వర్తింపజేయాలని కోరుతూ బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు నల్ల గంగామోహన్ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ మహ్మద్ షబ్బీర్‌కు ఆ పార్టీ నాయకులు వినతి పత్రం అందజేశారు. బీజేపీ జిల్లా నాయకులు గంగోనే సంతోష్, అనీల్ కుమార్, బడుగు సత్యం, గోపూరు ఒడ్డెన్న, పార్టీ మండల అధ్యక్షుడు రమావత్ సురేష్‌నాయక్, ముప్ప గంగారెడ్డి, గంగోనే వినోద్, తదితరులు పాల్గొన్నారు.

భీమ్‌గల్‌లో..

భీమ్‌గల్ : కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన కొద్ది రోజుల్లోనే రైతుల ఆగ్రహానికి గురవుతుందని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి నాగార్జున రెడ్డి అన్నారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలని కోరుతు తహసీల్దార్‌కు గురువారం బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగార్జున్ రెడ్డి మాట్లాడారు. కిసాన్ మోర్చ మండల అధ్యక్షుడు తోట గంగాధర్, కనికరం మధు, యోగేశ్వర నర్సయ్య, ఆరే రవీందర్, పార్థ సారథి పాల్గొన్నారు.